## విలేకరులు కావలెను

**మనవార్త దినపత్రిక లో పనిచేయుటకు విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

Cell: 9247819181
8309605189



TITLE Code TEL TEL12230

# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA






హైదరాబాద్,కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల ,సిద్దిపేట,కొత్తగూడెం గురువారం 10 అక్టోబర్ 2024 పేజీలు : 5 వెల : 2.00


## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే

# 30 వేల ఉద్యోగాలు




**మన వార్త** నిరుద్యోగులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. తెలంగాణలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలంటే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత కొలువులు ఊడగొట్టాలని ఆనాడే చెప్పా. చెప్పినట్లుగానే కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు ఊడగొట్టారు.. ఇప్పుడు మీకు కొలువులు వస్తున్నాయని అన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను రెండు సార్లు కొరివి దెయ్యం పాలించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చుకున్నారు.. కానీ పదేండ్లలో ఏనాడైనా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆలోచన చేశావా అని కేసీఆర్?ను ప్రశ్నించారు.తెలంగాణ డీఎస్సీలో సెలక్ట్ అయిన అభ్యర్థులకు ఇవాళ (2024, అక్టోబర్ 9) హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. ప్రత్యేక రాష్ట్రంలోనైనా ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులు ఎంతో ఆశగా ఎదురుచూశారు.. కానీ పదేండ్లలో బీఆర్ఎస్ ఏనాడు నిరుద్యోగులను పట్టించుకోలేదని మండిపడ్డారు. కానీ మేం అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు.తెలంగాణ పునర్ నిర్మాణంలో టీచర్లతో కీలక పాత్ర అని రేవంత్ రెడ్డి కొనియాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించామని తెలిపారు. మేం రాగానే టీచర్ల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టామన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తే అడ్డుకోవడానికి కొన్ని గుంటనక్కలు, కొరివి దెయ్యాలు ప్రయత్నించాయని.. కానీ ఆ కుట్రలన్నింటిని ఢీకొట్టి నియమాకాలు పూర్తి చేశామని తెలిపారు. ఇవాళ మీ సంతోషాన్ని చూసి కొందరు కళ్లలో కారం కొట్టుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలపై ఫైర్ అయ్యారు.

## రైతుబంధు కుంభకోణంలో తహసిల్దార్ అరెస్ట్




**మన వార్త** సూర్యాపేట జిల్లా హుజుర్నగర్ రైతుబంధు కుంభకోణం వెలుగుచూసింది. తహసిల్దార్ జయశ్రీని అరెస్ట్ చేసి.. 14 రోజులు రిమాండ్ తరలించారు. ప్రస్తుతం నల్లగొండ జిల్లా అనుముల తాసిల్దార్ గా పనిచేస్తున్న జయశ్రీ గతంలో హుజూర్నగర్ తాసిల్దార్ గా పని చేశారు.ఆమె, ధరణి ఆపరేటర్ జగదీష్ తో కలిసి రైతుబంధు నిధులు కొట్టేసింది. వారిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ లోకి తీసుకున్నారు. హుజూర్నగర్, బూరుగడ్డ రెవిన్యూ పరిధిలో 36.23 ఎకరాలకు ధరణి ద్వారా పాసుపుస్తకాలు పొంది రైతుబంధు నిధులు కాజేశారు.మొత్తం రూ. 14,63,004 రైతుబంధు నిధులు తహసిల్దార్, ధరణి ఆపరేటర్ కలిసి దారి మళ్లించారు. తహసిల్దార్ జయశ్రీ ధరణి ఆపరేటర్ జగదీష్ బంధువుల పేరిట 2019 పట్టాదారు పాసుబుక్కులు జారీ చేసింది. తహసిల్దార్, పట్టాదారులు రైతుబంధు డబ్బులను సగం సగం పంచుకున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మల్లారెడ్డి



**మన వార్త** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆయన అల్లుడు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి తన మనవరాలి వివాహానికి సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. కుటుంబ సమేతంగా తన మనవరాలి వివాహానికి రావాలని పెళ్లి పత్రికను సీఎంకు మల్లారెడ్డి అందించారు. సీఎంతో పాటు మల్లారెడ్డి కలిసిన వారిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం ఉన్నారు. కాగా, రెండు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును మల్లారెడ్డి కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఏపీ సీఎంతో తీగల కృష్ణారెడ్డి సైతం ఉన్నారు. ఇదిలా ఉండగా మల్లారెడ్డి అల్లుడు అయిన మర్రి రాజశేఖర్ రెడ్డి కూతురు వివాహ వేడుకలకు తెలుగు రాష్ట్రాల్లో కీలక నేతలను ఆహ్వానిస్తున్నారు.

## సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో

# కులగణనకు సర్కారు ఏర్పాట్లు




**మన వార్త** కుల గణనను నెల రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇందుకు 90 వేల మంది సిబ్బంది అవసరమని ఆఫీసర్లు అంచనా వేశారు. లెక్కలు పక్కాగా, పారదర్శకంగా ఉండేందుకు బీసీ సంక్షేమ శాఖకు సంబంధం లేకుండా జీఏడీ లేదా పంచాయతీ రాజ్ లేదంటే రెవెన్యూ శాఖల ఉద్యోగులతో గణన జరిపించే అంశాన్ని ప్రభుత్వం సీరియస్?గా పరిశీలిస్తున్నది. ఈ కార్యక్రమాన్ని మానిటరింగ్ చేసేందుకు ప్రత్యేకంగా సీనియర్ ఐఏఎస్ ను నియమించనున్నట్టు తెలుస్తున్నది. ఈ క్రమంలోనే మంగళవారం బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, మెంబర్లు బాలలక్ష్మి, తిరుమలగిరి సురేందర్, జయప్రకాశ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశమై, వివిధ రాష్ట్రాల్లో కుల గణన జరిగిన తీరుతెన్నులు, రాష్ట్రంలో అనుసరించాల్సిన విధి విధానాలు, సిబ్బంది సమీకరణ, పర్యవేక్షణ, కులగణనకు పట్టే సమయంలాంటి అంశాలపై చర్చించారు. త్వరలో కులగణనపై సీనియర్ మంత్రులు సమావేశమై, గైడ్?లైన్స్?కు తుదిరూపం ఇవ్వాలని నిర్ణయించారు. సీఎం తో ఆమోద ముద్ర అనంతరం ఉత్తర్వులు ఇచ్చేలా తాజా సమావేశంలో రూట్‌మ్యాప్‌రెడీ చేశారు.

## నెల నెలా జీతాలు ఇవ్వక

## పండుగ పూట కూడా పస్తులేనా..!



**మన వార్త** పోలీసులకు, ఆశ, అంగన్వాడీలు, మున్సిపల్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నెల నెలా జీతాలు ఇవ్వక పండుగ పూట కూడా వారిని పస్తులు ఉంచుతోందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్రావు అన్నారు.ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆశాలు, అంగన్వాడీలు, పార్ట్ టైం లెక్చరర్లు పండుగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఒకటో తేదీన జీతాలివ్వడం ఆచరణలో జరగడం లేదన్నారు. పోలీసులకు పది నెలలకు సంబంధించిన సరెండర్ లీవ్ డబ్బులు ఇవ్వలేదని, హౌంగార్డ్ జీతాలు ఆలస్యంగా ఇస్తున్నారని ఆరోపించారు. మహిళలు ఘనంగా చేసుకోవాల్సిన బతుకమ్మ పండుగను ఆర్థిక ఇబ్బందులతో చేసుకోలేకపోతున్నారన్నారు. మూసీ సుందరీకరణకు లక్ష యాభై వేల కోట్లు ఖర్చు చేస్తానన్న సీఎం, వృద్ధులకు, వితంతువులకు పింఛన్లు ఇవ్వడం లేదని, వారి ఉసురు పోసుకుంటున్నారని విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు మార్చి నెల నుంచి బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.గత దసరా పండగ సమయంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రచారం చేసిన యువత ఆలోచించాలని, ఇప్పుడు ఆ పార్టీ చేస్తున్న మోసాలను వివరించాలని కోరారు. నిరుద్యోగ భృతి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధుల జీతాలు ఇవ్వలేదని, కాంగ్రెస్ పాలనలో పంచాయతీ సెక్రటరీలు అప్పుల పాలయ్యారని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, బియ్యం ధరలకు రెక్కలొచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు.రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆగమై లక్షల మంది వ్యాపారులు రోడ్డున పడ్డారని చెప్పారు. రేవంత్రెడ్డి కాంగ్రెస్ గ్యారంటీ అంటే గోల్డెన్ గ్యారంటీ అన్నారని, అది గోల్మాల్, గోబెల్స్ గ్యారంటీ అని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా హరీశ్రావు రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ రాజనర్సు తదితరులు ఉన్నారు.


మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA

epaper

చదవడానికి QR కోడ్‌ను స్కాన్ చేయండి

http://manavaartha.net

MANA VAARTHA


## పెరిగిపోతున్న అక్రమ నిర్మాణాలు



**మన వార్త** మంచిర్యాల జిల్లా కేంద్రంలో అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడాలపై కొరడా ఝుళిపిస్తున్నా నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తూనే ఉన్నారు.ప్రధాన వీధుల్లో రోడ్ల ఆక్రమణలపై ఇటీవల మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. బాలుర ఉన్నత పాఠశాల, మార్కెట్ రోడ్డు, అర్చన టెక్స్ చౌరస్తాలో రోడ్లను ఆక్రమించి వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్నారు. అధికారులు తొలగిస్తున్న వాటిలో చిరు వ్యాపారులు మొదలుకొని బడా బాబులకు చెందిన భవనాలు ఉన్నాయి.అర్చన టెక్స్ చౌరస్తా నుంచి మొదలుకొని పోలీస్‌స్టేషన్ చౌరస్తా వరకు అక్రమ కట్టడాలను తొలగించాలని ముందస్తుగా నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయా నిర్మాణాలను యజమానులు స్వచ్ఛందంగా తొలగిస్తుండగా, మరికొన్ని చోట్ల అధికారులే కూల్చి వేయిస్తున్నారు. అయితే పండుగ సమయంలో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉండటంతో తొలగింపు ప్రక్రియకు కొంత విరామం ఇచ్చినట్లు తెలుస్తోంది. గతంలోనూ మున్సిపల్ అధికారులు ఆక్రమణలను తొలగించేందుకు యత్నించగా, అప్పట్లో మంచిర్యాల ఏసీపీగా విధులు నిర్వహించిన విజయ్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. దీంతో మార్కెట్ రోడ్డులోని కొన్ని బహుళ అంతస్థుల భవనాల మెట్లను తొలగించారు.అయితే ఆ తరువాత రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అక్రమ కట్టడాల తొలగింపు ప్రక్రియ ముందుకు సాగలేదు. ఫలితంగా రోడ్డు ఆక్రమణలు మరింతగా విస్తరించాయి. గతంలో ఖాళీగా ఉన్న రోడ్డు ఆక్రమణలతోనే పరిమితమైన అక్రమ నిర్మాణాలు తాజాగా నాలాలపై వెలుస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారుల పక్కన పెద్ద పెద్ద నాలాలను నిర్మించారు. అక్రమ నిర్మాణాలు చేపడు తూ కొందరు కబ్జాలకు పాల్పడుతున్నారు. దీంతో నాలాలు ఇరుకుగా మారి, వరదల సమయంలో వర్షం నీరంతా రోడ్లపైకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

## ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా హాస్పిటల్స్ పనిచేయాలి



**-ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**


**కుత్బుల్లాపూర్,అక్టోబర్,09,(మన వార్త)**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచు పల్లిలోని కృష్ణజా హిల్స్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన "ఎం.వీ.రెడ్డి డెంటల్ హాస్పిటల్" ను ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంగా హాస్పిటల్స్ పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, దుందిగల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ,కార్పొరేటర్ బాలాజీ నాయక్, కో- ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్,గాజులరామారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విజయ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి అమ్మవారి సేవలో ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్,అక్టోబర్,09,(మన వార్త)**
కొంపల్లి మున్సిపాలిటీ పరిధి ప్రశాంత్ నగర్ లో మరియు 130 – సుభాష్ నగర్ డివిజన్ మోడీ బిల్డర్స్ లలో నిర్వహించిన అమ్మవారి నవరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని అమ్మవారికి మహా హారతినిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ అష్టైశ్వర్యాలు ప్రసాదించే మహాలక్ష్మి అమ్మవారి దయతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో దూలపల్లి మాజీ సర్పంచ్ చింతల దేవేందర్ యాదవ్,చింతా యాదవ్,గుబ్బాల లక్ష్మీనారాయణ,భాస్కర్ రెడ్డి, చారి, హరిబాబు,విజయ భాస్కర్ రెడ్డి, మహేష్,రాజేష్,అనిల్ కుమార్,సీతారామరాజు,వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## డి.పోచంపల్లి లో రాజ శ్యామల యాగంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్,అక్టోబర్,09,(మన వార్త)**
డి. పోచంపల్లి లో ఆర్కే ఎంటర్ప్రైజెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ శ్యామల యాగానికి మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ నియోజకవర్గ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, ఈ దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రాజ శ్యామల యాగాన్ని నిర్వహించడం చాల సంతోషంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్కే ఎంటర్ప్రైజెస్ ఎండి రాంబాబు,బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి ఆరోగ్య పెన్నిధి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్,అక్టోబర్,09,(మన వార్త)**
పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో 130 – సుభాష్ నగర్ డివిజన్ సాయిబాబా నగర్ నర్సింహ బస్తీ కి చెందిన సన కౌసర్ భర్త ఫరీద్, 131 – కుత్బుల్లాపూర్ డివిజన్ ప్రసూన నగర్ కు చెందిన కె.ఆకిర తండ్రి వెంకటేశ్వర రావు ల ఆరోగ్య పరిస్థితి బాగాలేదని స్థానిక నాయకుల ద్వారా సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సన కౌసర్ (రూ.2,50,000/ –), , కె. అకిర (రూ.2,00,000/–) లకు ఎల్ఓసీ మంజూరు చేయించి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసానిస్తుందన్నారు.

## ఇటిక్యాల లో ఉచిత మేఘా వైద్య శిబిరం



**గజ్వేల్ అక్టోబర్ 09(మన వార్త ప్రతినిధి జీ మురళి)**
సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో గురువారం మెడిసిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో , గ్రామ తాజా మాజీ సర్పంచ్ రావి కంటి చంద్రశేఖర్ ఆర్ బి పి మెమోరియల్ ట్రస్ట్ నేతృత్వంలో ఉచిత మేఘా వైద్య శిబిరం నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామ తాజా మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిన మెడిసిటీ వైద్య బృందానికి ధన్యవాదాలు తెలిపారు అనంతరం డాక్టర్ భవిత ఆర్థోపెడియన్ డాక్టర్ ప్రేరణ జనరల్ మెడిసిన్ డాక్టర్ ప్రశంస డాక్టర్ దీప్తి జనరల్ మెడిసిన్ కుమార స్వామి, మాట్లాడుతూ గ్రామంలో సీజనల్ వ్యాధులు, వస్తున్నాయని ఉద్దేశంతో మెడిసిటీ ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగిందని అన్నారు. ఎవరైనా హాస్పటల్ కు రాని నిరుపేద రోగులు ఇటిక్యాల లో హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగిందని అలాగే కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పిల్లలు లేని మహిళలకు అలాగే సంతానం లేని వారికి గర్భిణీలకు వరిబీజ ఆపరేషన్ గర్భసంచికి సంబంధించిన ఉచితంగా ఆపరేషన్లు చేయబడుతుందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బిపి మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు రావికంటి నాగరాజు, వీరేశం,మహంకాళి నాగరాజు, కందుకూరి నాగరాజు, గ్రామ టిఆర్ఎస్ నాయకులు జానకిరాములు, సాయిలు, భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ స్వామి,దొడ్డి మహేష్,, వెంకటయ్య గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెర సంఘం యూత్ అధ్యక్షునిగా గుంజె సాయికుమార్ నియామకం



**హసన్ పర్తి అక్టోబర్ 9(మనవార్త ప్రతినిధి కోడెపాక(శ్రీకాంత్):** హనుమకొండ జిల్లా 55వ డివిజన్ కి చెందిన గుంజే సాయి కుమార్ ని తెలంగాణ వడ్డెర సంఘం హన్మకొండ జిల్లా యూత్ అధ్యక్షునిగా నియమించినట్లు తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన హనుమకొండ జిల్లా తెలంగాణ వడ్డెర సంఘం యూత్ అధ్యక్షునిగా గుంజె సాయికుమార్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలోని వడ్డేరులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, వడ్డేరుల ఐక్యత కోసం కృషి చేస్తానని,అంతేగాక వడ్డేరులను ఎస్టీ జాబితాలోకి తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## గండీడ్ మండల కేంద్రంలో మాన్యవర్ కాన్షిరాం 18వ వర్ధంతి



**గండీడ్. అక్టోబర్ 09. ( మన వార్త ప్రతినిధి)**
కాన్సిరాం పంజాబ్ రాష్ట్రంలోని రోపర్ జిల్లాలో 1934 సంవత్సరం మార్చ్15 తారీఖున జన్మించాడు అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సెలవు దినాన్ని జరుపుకోవాలని భావించిన దళిత ఉద్యోగిపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన యాన్ హిలేషన్ ఆఫ్ క్యాస్ట్ అనే పుస్తకాన్ని చదివిన తర్వాత ఆయన ఇదే దిశగా పురికొల్పబడిందని ఆయన అభిమానించేవారు అభిప్రాయపడుతున్నారు అంబేద్కర్ మరియు తత్వశాస్త్రం నుండి బలంగా ప్రేరణ పొందారు మాయావతి ఒక ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నప్పుడు ఆమెను రాజకీయాల్లోకి తీసుకువచ్చి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి చేయడం జరిగింది సాంఘిక అసమానతలు అంటరానితనం కుల పీడన మత ఘర్షణలు శూద్ర అతి శూద్రుల పేర్ల చేత పేదరికంతో ప్రజలు హింసించబడుతున్న వేళ అనేక వివక్షలకు దారి తీసిన నేపథ్యంలో బానిస విముక్తి నుంచి అక్షరాస్యత వైపు నడిపిన మహాత్మ జ్యోతిరావు పూలే సాహు మహారాజ్ అంబేద్కర్ నారాయణ గురువు పెరియార్ భాగ్యరెడ్డి వర్మ లాంటి ఉద్యమకారులు చేసిన ఉద్యమాల పట్ల దేశంలో ఎన్నో చారిత్రక మార్పులకు దారి తీసింది బహుజన మహాత్ముల బాటలో నడిచిన మరో మహానుభావుడు భారతదేశ చరిత్రలో మరో చారిత్రక మలుపు తెప్పిన మరో గొప్ప నాయకులు బహుజన లోకం ఒకటైతే రాజ్యాధికారం వస్తుందని బహుజన సమాజ్ పార్టీ స్థాపన ద్వారా నిరూపించిన ఏకైక వ్యక్తి బోధించు సమీకరించు పోరాడు సిద్ధాంతానికి నిదర్శనంగా 1983 మార్చ్ 15న ఢిల్లీ నుండి బయలుదేరి ఏడు రాష్ట్రాల గుండా వంద సైకిళ్లతో నలభై రోజులలో 4200 కిలోమీటర్లు ప్రయాణించి ప్రజలను బహుజన ఉద్యమం వైపు మరల్చిన గొప్ప వ్యక్తి కాన్సిరాం అక్టోబర్ 9, 2006 సంవత్సరంలో తొలి శ్వాస విడిచారు కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య డి.ఎస్.పి మండల అధ్యక్షుడు పసుల శ్రీనివాస్ మల్కయ్య సిఐటియు జిల్లా నాయకులు పకీరయ్య చేన్నాయపల్లి వెంకటయ్య, హస్నాబాద్ వెంకటయ్య వెన్నచేడ్ బసప్ప జిన్నారం తండా లోకేష్ గుండాల ఆంజనేయులు నాయక్ జొల్లు పెద్ద చెన్నయ్య వేపూరి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజశ్యామల అమ్మవారి దయతో చేపట్టిన ప్రతీ కార్యంలో విజయం చేకూరాలి



**-ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**కుత్బుల్లాపూర్,అక్టోబర్,09,(మన వార్త)**
దుందిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి లో ఆర్.కే ఎంటర్ప్రైజెస్ ఎర్త్ మూవింగ్ స్పేర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "రాజశ్యామల యాగానికి" ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై శ్యామలాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ రాజశ్యామలాదేవి కృపతో చేపట్టిన ప్రతి పనిలో విజయం చేకూరాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ,అగ్రికల్చర్ మాజీ చైర్మన్ రవీందర్ యాదవ్,కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, సాయి యాదవ్,గోపాల్ రెడ్డి, నిర్వాహకులు రాంబాబు మరియు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలు భాగంగా..

**వేములవాడ, అక్టోబర్ 09 (మన వార్త ప్రతినిధి నందు రావు):**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు భాగంగా శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారు కాలరాత్రి అవతార అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్థానాచార్యులు అప్పాల బీమా శంకర్ శర్మ ఆధ్వర్యంలో శ్రీ స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి చతుష్షష్టి పూజలు నిర్వహించారు. నాగిరెడ్డి మండపంలో గాయత్రి జపం, చండీ హెూమం, గాయత్రి హవనాన్ని వేదమంత్రాలతో నిర్వహించారు. మూల నక్షత్రం సందర్భంగా పుస్తక రూపిని మహా సరస్వతి పూజ, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలాగే, బాల త్రిపుర సుందరీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లా మున్నూరు కాపు వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ గా కూరగాయల కొమురయ్య



**వేములవాడ, అక్టోబర్ 09 (మన వార్త ప్రతినిధి నందు రావు):**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర మున్నూరు కాపు సత్రంలో రాష్ట్ర మునర్ కాపు సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో వేములవాడ పట్టణానికి చెందిన కూరగాయల కొమరయ్యకు జిల్లా మునూరుకాపు వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించడం జరిగిందని అన్నారు ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తూ రానున్న రోజుల్లో మున్నూరు కాపు అభ్యున్నతికి తోడ్పడుతానని అన్నారు.

## విద్యారంగా అభివృద్ధియే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



**గజ్వేల్ అక్టోబర్ 09(మన వార్త ప్రతినిధి జీ మురళి)**
గత పదేళ్లుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువతకు ఉపాధ్యాయ కొలువుల జాతర వారి జీవితాల్లో కొత్త వెలుగు నింపుతుందని గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ పేర్కొన్నారు. ఈరోజు నూతన ఉపాధ్యాయ అభ్యర్థులు గజ్వేల్ ఐఓసి కార్యాలయం నుంచి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ సర్టిఫికెట్లు పొందటానికి హైదరాబాదులోని ఎల్బీ స్టేడియం బయలుదేరుతున్న సందర్భంగా వారిని కలిసి అభినందించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో గౌరవంతమైన వృత్తి ఏదైనా ఉన్నది అంటే అది ఉపాధ్యాయ వృత్తి అని దానిని మీరు చేపట్టబోతున్నారని సమాజాన్ని మంచిగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులది తమ కృషితో విద్యార్థులకు సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు చేయాల్సిన గురుత్రర బాధ్యత ఉందని అలాగే అలాగే ప్రైవేట్ విద్యా సంస్థలకు పోటీగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరిపి విద్య వ్యాపారికరణ నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉపాధ్యాయులదేని పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుఖేందర్ రెడ్డి డిసిసిబి మాజీ డైరెక్టర్ కుంట్ల లక్ష్మారెడ్డి, అశోక్ రెడ్డి, నక్క రాముడు, డప్పు గణేష్, గుంటుకు బిక్షపతి, సురేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**కమలాపూర్ అక్టోబర్ 09(మనవార్త ప్రతినిధి కళ్యాణ్)**
కమలాపూర్ మండల పరిధిలోని కన్నూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో 2007 2008వ సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులందరు కలిసి నిర్వహించిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిధులుగా ఆనాటి ప్రధానోపాధ్యాయులు ఆకుల సదానందం మరియు ఉపాధ్యాయులు కొండా తిరుపతి బండ సమ్మయ్య సబితాంజలి జోగు సారంగపాణి సందగల ప్రభాకర్ లు పాల్గొన్నారు కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు సదానందం మాట్లాడుతూ విద్యార్థులుగా మిమ్మల్ని క్రమశిక్షణతో ఒక మంచి భవిష్యత్తు కోసం మేము ఎంతగానో కృషి చేసి మీభవిష్యత్ కి ఉపయోగపడే విషయాలను నేర్పి మీవిజయాలకు దోహద పడేల చేసెది ఒక ఉపాధ్యాయులు మాత్రమే అని గుర్తుచేసారు పదహారు సంవత్సరాల తరువాత మిమ్మల్ని ఇలా చూడడం ఆనందాన్నిచ్చింది అన్నారు పూర్వ విద్యార్థులు అంత కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పాఠశాలలో జరిగిన సంఘటనలను గుర్తుచేసుకుని మైమరచి పోయారు ఈ కార్యక్రమం లో పూర్వ విద్యార్థులు నాగరాజు రాజేష్ గణేష్ నరేష్ రాకేష్ ప్రవీణ్ శ్రవణ్ సుమన్ కళ్యాణ్ మరియు శిరీష శ్రీదేవి నీతిష రజిత అపర్ణ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో మహా అన్నదానం



**వరంగల్ అక్టోబర్ 9(మనవార్తప్రతినిధి కోడెపాక(శ్రీకాంత్):** కొత్తవాడ వరంగల్ ఫ్రెండ్స్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో 20వ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈరోజు అమ్మవారు సరస్వతీ మాత అవతారంలో అమ్మవారిని అలంకరించడం జరిగింది ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధానంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఫ్రెండ్స్ సేవా సంఘ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐ గోపి మరియు చిప్ప వెంకటేశ్వర్లు కమిటీ సభ్యులు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## మహంకాళి మాత ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు



**-శాంభవి మాత అలంకరణలో అమ్మవారు**

**గజ్వేల్ అక్టోబర్ 09(మన వార్త ప్రతినిధి జీ మురళి)**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు బుధవారం శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పురోహితులు నంద బాల శర్మ ఆధ్వర్యంలో హెూమం కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు శాంభవి మాత అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చిన మహంకాళి మాత, మహంకాళి మాత శరన్నవరాత్రి వేడుకలలో పాల్గొన్న కౌన్సిలర్ భాగ్యలక్ష్మి దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ మహంకాళి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయని, హెూమం కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అందరూ బాగుండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందని అన్నారు.

## తెలంగాణ ఉద్యమ కళాకారుల రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యవర్గం ఎన్నిక



**వేములవాడ అక్టోబర్ 09 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**

బుధవారం రోజున తెలంగాణ ఉద్యమ కళాకారుల రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యవర్గం ఎన్నిక జరిగింది ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర కళాకారుల కన్వీనర్ యెల్ల పోశెట్టి అధ్యక్షతన జరిగిన సమావేశమునకు ముఖ్య అతిథులుగా సంస్థ న్యాయ సలహాదారు నేరెళ్ల తిరుమల గౌడ్ గౌరవ అధ్యక్షులు బొజ్జ కనకయ్య బొడ్డు రాములు కళా సంస్థల సమైక్య జిల్లా అధ్యక్షులు సావనపల్లి శ్రీనివాసు 50 మంది కళాకారులు పాల్గొన్నారు.గౌరవ అధ్యక్షులు బొజ్జ కనకయ్య బొడ్డు రాములు న్యాయ సలహాదారులు తిరుమల్ గౌడ్ అధ్యక్షులు వారాల దేవయ్య ఉపాధ్యక్షులు బొడ్డు నారాయణ బుర్రి శంకరయ్య ఆడెపు ద్వితీయ చందు నాయని సత్తిరెడ్డి తాటికొండ లత ప్రధాన కార్యదర్శి మానువాడ లక్ష్మీనారాయణ సంయుక్త కార్యదర్శి గుమ్మడి రాజేశం గౌడ్ సాంస్కృతిక కార్యదర్శి దొంగరి లక్ష్మీరాజం కోశాధికారి చిలుముల రమేష్ చారి కార్యవర్గ సభ్యులు ముస్తఫా మొగులోజి లక్ష్మీరాజ్యం మామిండ్ల సత్తయ్య ఎన్నిక అయ్యారు.

## బాలగోపాల్ ఆశయాలను కొనసాగిస్తాం



**– పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణా ముదిరాజ్...**

**మహబూబ్ నగర్. అక్టోబర్ 09. (మన వార్త ప్రతినిధి):**

హక్కులనేత బాలగోపాల్ ఆశయాలను కొనసాగిస్తామని పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు కృష్ణా ముదిరాజ్ అన్నారు. మానవ హక్కుల వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బాలగోపాల్ 15వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నగారిన వర్గాలకు పీడిత ప్రజల కొరకు ఆయన చేసిన సేవలను ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. వివిధ ప్రజాల కు అండగా నిలిచి వారి తరపున అనేక పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి బాలగోపాల్ అని అన్నారు ఆయన లేని లోటు సమాజానికి స్పష్టంగా కనిపిస్తున్నారు. కార్యక్రమంలో తెలంగాణ బహుజన సమితి అధ్యక్షులు ఆలూరి చెన్నయ్య, రజక రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు శివన్న , పాలమూరు లేబర్ సంఘం అధ్యక్షులు గడ్డమీది గోపాల్, బండారి చెన్నయ్య, బి వెంకటేశ్వర్లు, అనుప జంగన్న, వంట కార్మికుల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎల్ పెంటయ్య, కళాకారుల సంఘం బాలచందర్, పద్మ నరేష్, బషీర్, భారత్ ట్రావెల్స్ అండ్ ట్రాన్స్పోర్ట్ నాయకులు సయ్యద్ అలీ తదితరులు పాల్గొన.

## సరస్వతి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు




**–అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న : మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు...**

**ఇల్లంతకుంట అక్టోబర్ 09 (మన వార్త ప్రతినిధి బొంగోని రాజు)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పొత్తూరు గ్రామంలో కొలువుదీరిన శ్రీ దుర్గా దేవి మండపం వద్ద పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సిద్ధం వేణు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు,మాజీ సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి భార్యను ఏసీబీ అధికారులకు పట్టించిన భర్త



**హైదరాబాద్ ఇన్చార్జి భాస్కర్ చారి, అక్టోబర్9,(మనవార్త).**

అవినీతి భార్యను ఏసీబీ అధికారులకు పట్టించిన భర్త. వివరాల్లోకి వెళితే హైదరాబాద్ శివారులోని మణికొండ మున్సిపల్ కార్యాలయంలో డీఈఈ గా ఉద్యోగం నిర్వహిస్తున్న దివ్యజ్యోతి ఓ కాంట్రాక్టర్ల నుంచి లంచంగా తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చి పట్టించాడు కట్టుకున్న భర్త. అవినీతిగా తీసుకున్న నగదును ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ పెడుతుందని భర్త శ్రీపాద్ తెలిపారు. బీరువాలో,పరుపు కింద,దేవుని గుడిలో,కిచెన్ లో పూల కుండీలో,ఎక్కడ పడితే అక్కడే పేపర్లో చుట్టిన నోట్ల కట్టలతో ఉన్న వీడియోను భర్త శ్రీపాద్ బయట పెట్టాడు. లంచం తీసుకోవడంపై భార్యాభర్తల మధ్య చాలా సార్లు గొడవలు జరిగినట్లు తెలుస్తుంది. అయినా తీరు మార్చుకోక పోవడంతో లంచగొండి భార్యను ఏసీబీ అధికారులకు పట్టించాడనీ అధికారులు తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణ చేయకుండానే ప్రభుత్వ టీచర్ల ఉద్యోగాల భర్తీ సరికాదు



**రాజన్న సిరిసిల్ల అక్టోబర్ 09 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**

రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండానే ప్రభుత్వ ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎమ్మార్పీఎస్ సిరిసిల్ల జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి మాదిగ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. వర్గీకరణ చేయకుండానే డీఎస్సీ ఫలితాలు విడుదల చేసి 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రల్లో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి, ధర్నా చేయాలని రాష్ట్ర హై కమాండ్ పిలుపునివ్వడంతో బుధవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా నుంచి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ముందు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులను లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని అధికారులకు వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయకుండానే ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయ నియామక పత్రాలు ఇవ్వడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రిక ఎలా చేపడుతారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే వరకు, మాదిగల వాటా తేలే వరకు ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు జరపొద్దని హెచ్చరించారు. తమ నిరసనలను పోలీసులు అడ్డుకున్నా ర్యాలీ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు జిల్లా అధ్యక్షులు ఖానాపూర్ లక్ష్మణ్, పార్టీ రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్ మాదిగ, గుండా థామస్ మాదిగ, గుండేటి రాజు మాదిగ, కత్తెరపాక రవీందర్ మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పద్మశాలి ప్రతిభా పురస్కారం అందుకున్న వెల్దండి హారిణి...



**వేములవాడ అక్టోబర్ 09 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**

పద్మశాలి సేవా సంఘం రామగుండం కార్పొరేషన్ ఆధ్వర్యంలో పద్మశాలి విద్యార్థినీ, విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పదవ తరగతి, ఇంటర్, ఎం.సెట్ మొదలగు పరీక్షలలో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థినీ, విద్యార్థులను సత్కరిస్తూ ప్రశంసా పత్రంతో పాటు మేమోంటో అందించారు. అందులో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన వెల్దండి హరిణి ఇంటర్ ఫలితాల్లో 472 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబరిచి నందున పద్మశాలి ప్రతిభా పురస్కారం అందించిన రామగుండం ఏరియా పద్మశాలి సేవా సంఘం...ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్న వెల్దండి హరిణి మాట్లాడుతూ పద్మశాలి సేవా సంఘం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ, విద్యార్థులను గుర్తించి వారికి ప్రోత్సాహం ఇవ్వడం చాలా సంతోష తగ్గ విషయం అని తెలిపారు.. రానున్న రోజుల్లో ఇలాగే పద్మశాలి యువతీ, యువకులకు ఇలాంటి ప్రోత్సాహం అందించి పద్మశాలి విద్యార్థినీ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు చిప్ప రాజేశం, పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి ఆడెపు శంకర్, పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్టల లక్ష్మీనర్సయ్య, పద్మశాలి సంఘం కోశాధికారి కొండా సంపత్ తో పాటు పద్మశాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జనసేవ ఫౌండేషన్ ద్వారా గుగ్గిళ్ళ శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**వేములవాడ అక్టోబర్ 09 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్)**

వేములవాడ పట్టణానికి చెందిన గుగ్గిళ్ళ శ్రీనివాస్ ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందడం జరిగినది. ఈ విషయం తెలుసుకున్న తన చిన్ననాటి మిత్రబృందం వేములవాడ 2004 – 2005 బ్యాచ్ కు సంబంధించి మిత్రులు జనసేవ ఫౌండేషన్ ద్వారా గుగ్గిళ్ళ శ్రీనివాస్ కి 8 సంవత్సరాల కూతురు ఉన్న విషయం తెలుసుకొని ఆమె పేరుపైన సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా 35000/– రూపాయలు డిపాజిట్ చేయడం జరిగినది.ఇట్టి పోస్ట్ ఆఫీస్ పాసుబుక్ ను కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు బడుగు అరుణ్, ప్రధాన కార్యదర్శి వడ్లకొండ శ్రీకాంత్, కోశాధికారి సామ ప్రశాంత్, ఉపాధ్యక్షుడు మల్లమారి కర్ణాకర్, కార్యదర్శి పెద్దవేని హైదర్ యాదవ్ పాల్గొనడం జరిగింది.

## క్రీడలతో ఒత్తిడి దూరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్–09 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్)**

ప్రశాంతమైన మంచి భద్రతతో కూడిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడంలో పోలీసు శాఖ పాత్ర ఎనలేనిదని , ఇటువంటి పోలీసు శాఖకు క్రీడా పోటీల నిర్వహణ ద్వారా వారి ఒత్తిడి కొంత తగ్గుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే బతుకమ్మ దసరా పండుగ సందర్భంగా మహిళలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా పోటీల నిర్వహణ వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలతో స్నేహభావం పెరగడానికి ఉపయోగపడుతుందని అన్నారు.క్రీడలు అంటే ప్రత్యేక ఆసక్తితో వాలీబాల్ పోటీలలో పాల్గొని మంచి బహుమతుల సైతం తాను సాధించానని ప్రభుత్వ విప్ తెలిపారు.యువత కబడ్డీ కోకో వాలీబాల్ మొదలగు అన్ని రకాల క్రీడల వైపు ఆసక్తి చూపించాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు.యువత సన్మార్గంలో నడిచేందుకు గంజాయి రహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు ముఖ్యమంత్రి రూపొందించిన ప్రణాళికలను పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని అన్నారు.చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ,సిరిసిల్ల జిల్లాలో ఎస్పీ మంచి కార్యక్రమం తీసుకున్నారని, కుటుంబాలకు దూరంగా ఒత్తిడితో పని చేసే పోలీసు శాఖ అధికారులకు సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహించారని అన్నారు. మనమంతా ప్రశాంతంగా జీవించాలంటే పోలీసు శాఖ పనితీరు చాలా ముఖ్యమని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో పోలీసు శాఖ పనితీరుపై ఎటువంటి ఉత్తర లేకుండా పూర్తి స్వేచ్ఛ కల్పించామని అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజాన్ మాట్లాడుతూ పోలీస్ శాఖ క్రీడా పోటీలు నిర్వహించడం చాలా మంచి కార్యక్రమం అని, 24 గంటలపాటు అలర్ట్ గా ఉంటూ విధులు నిర్వహించే పోలీస్ శాఖకు ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు.క్రీడా పోటీలలో పాల్గొన్న సిబ్బంది అందరికీ ప్రత్యేక అభినందనలు అందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఇటీవలే మానేరు వాగులో ఆత్మహత్యకు ప్రయత్నించిన వృద్ధురాలని కాపాడిన కానిస్టేబుల్ ను అభినందిస్తూ సర్టిఫికెట్, క్యాష్ ప్రైజ్ అందజేసి సత్కరించారు.

## వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తే మాదిగలకు తీవ్ర అన్యాయం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 9 (మనవార్త ప్రతినిధి)**

రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేసే విషయాన్ని నిరసిస్తూ ఈనెల 9న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ గారి పిలుపులో భాగంగా, బుధవారం నాడు సుజాతనగర్ మండల మాదిగఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు "ఈ సందర్భంగా మాదిగ ఐక్యవేదిక మండల గౌరవ సలహాదారులు కత్తి వెంకన్న, ఉపాధ్యక్షులు అంకి శెట్టి రామకృష్ణ, సహాయ కార్యదర్శి కేసు పాక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ" గత రెండు నెలల క్రితం సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, ఇచ్చిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి దేశంలో వర్గీకరణ ముందుగా తెలంగాణలోనే అమలు చేస్తామని నోటిఫికేషన్ ఇచ్చిన ఉద్యోగాలకు కూడా వర్గీకరణ అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారని "ఆ ప్రకటనకు రాష్ట్ర మాదిగలంతా రేవంత్ రెడ్డి పై నమ్మకం ఉంచారని" కానీ మాటమీద నిలబడకుండా ఇప్పుడు ఉద్యోగాలు భర్తీ కార్యక్రమం చేపట్టారని" అలా చేస్తే మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉన్నదని" కావున వెంటనే వర్గీకరణ అమలు చేసి ఇప్పటి ఉద్యోగాల భర్తీలో మాదిగలకు న్యాయం జరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు" ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఈట వెంకట సాయి, కోంద్రు ప్రవీణ్, మురిపిటి నాగయ్య ,దంసలపూడి పవన్, కత్తి మనోజ్, కాకిల్లి శ్రీను, ప్రసాద్, వెంకటేష్ ,జగదీష్ ,గోపి, పవన్, సూర్యం తదితరులు పాల్గొన్నారు

## రాజన్న సిరిసిల్ల జిల్లా మున్నూరు కాపు వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్



**వేములవాడ అక్టోబర్ 09 ( మన వార్త ప్రతినిధి దిబ్బేటి ప్రవీణ్)** బుధవారం రోజున వేములవాడ శ్రీ రాజరాజేశ్వర మున్నూరు కాపు సత్రంలో రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో వేములవాడ పట్టణానికి చెందిన కూరగాయల కొమరయ్యకు జిల్లా మున్నూరు కాపు వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించడం జరిగిందని వారన్నారు ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తూ రానున్న రోజుల్లో మున్నూరు కాపు అభ్యున్నతికి తోడ్పడుతానని వారన్నారు.

## గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన మల్లు నర్సింహ్మారెడ్డి



గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన మల్లు నర్సింహ్మారెడ్డి మహబూబ్ నగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయం లో మల్లు నర్సింహ్మారెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి , జడ్చర్ల ఎమ్మెల్యే శ్రీ అనిరుద్ రెడ్డి , రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ , మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ , మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి , వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్ మరియు గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలంతా సంతోషంగా ఉండేలా చూడు తల్లి

**-ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్,అక్టోబర్,09,(మన వార్త)** దుందిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేటలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి నవరాత్రి వేడుకల్లో అమ్మవారు సరస్వతి దేవిగా దర్శనమిచ్చారు. ఈ నవరాత్రి వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ దేవీ నవరాత్రులలో భాగంగా అమ్మవారు సరస్వతి అవతారంలో ఉంటూ విద్యాబుద్ధులు ప్రసాదించే తల్లిగా పూజలందు కుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అర్కల అనంతస్వామి,స్థానిక బస్తీ తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ అసిస్టెంట్ 2వ ర్యాంక్ దక్కించుకున్న నరేష్



**హసన్ పర్తి అక్టోబర్ 9(మనవార్తప్రతినిధి కోడెపాక(శ్రీకాంత్):**హసన్ పర్తి మండలం మడిపల్లి గ్రామానికి చెందిన ముంజ నరేష్ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలో డీఎస్సీ-2024 లో స్కూల్ అసిస్టెంట్( సోషల్ స్టడీస్ )ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన నరేష్ డీఎస్సీలో ఎంపీక కావడంతో నరేష్ తల్లిదండ్రులు తమా సంతోషాన్ని వ్యక్తపరిచారు. బుధవారం మధ్యహ్నం ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు స్వీకరించే సభలో పాల్గొని సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోవడంతో గ్రామ ప్రజలు సర్వత్ర హర్షం వ్యక్తం చేశారు.

## కొమ్ముగూడెం దగ్గర ఆటోని ఢీ కొట్టిన బస్సు



**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 9 ( మన వార్తా ప్రతినిధి)** జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామం వద్ద ఖమ్మం నుంచి మణుగూరు వెళ్తున్న బస్సును కొత్తగూడెం వైపు నుండి జూలూరుపాడు వెళుతున్న ఆటో ఢీకొన్నాయి. ఆటోలు ప్రయాణిస్తున్న భవాని మాలలో ఉన్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మాలలో ఉన్న ఇద్దరు వ్యక్తులు పాల్వంచ మండలానికి చెందిన వారిగా గుర్తింపు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపం బతుకమ్మ పండుగ

**- గాజుల శ్రీనివాస్**



**గజ్వేల్ అక్టోబర్ 09(మన వార్త ప్రతినిధి జీ మురళి)** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతిరూపమని మాజీ వార్డ్ సభ్యులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాజుల శ్రీనివాస్ అన్నారు బుదవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు కొలమానం బతుకమ్మ పండుగ అని ఎంతో ఇష్టంతో మహిళలు జరుపుకునే పండుగ బతుకమ్మ పండుగ అని గౌరీ మాత అనుగ్రహంతో అందరూ బాగుండాలని ఆకాంక్షించారు, బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు చిన్నారులు అందరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలని అందరికీ బతుకమ్మ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు

## మాలోని కళను గుర్తించి -కోలాటంలో మాకు మంచి గుర్తింపు తెచ్చి వ్యక్తి



**అక్టోబర్ 9 మన వార్త ప్రతినిధి** కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఆశాదిప్ రెడ్డి అంటున్న తాండ్ర గ్రామ మహిళలు కల్వకుర్తి పట్టణంలోని తాండ్ర గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఆశాదీప్ రెడ్డి చేస్తున్న సేవలు చాలా గొప్పవని ఐదు సంవత్సరాలుగా ఎవరు చేయలేని సేవలను తన సొంత డబ్బులతో చేస్తున్నాడని కొందరు ఆయన పై ఆరోపణలు చేస్తున్నారని అలాంటి వారికి తగిన గుణపాఠం చెప్తామని ఆశాదీప్ రెడ్డి తమ పొట్ట కొట్టలేదని తాండ్ర గ్రామంలో బతుకుతెరివే భారంగా ఉన్న మాకు మాలోని కలలను గుర్తించి కోలాటంలో అవకాశం కల్పించి జీవనోపాధి కల్పించిన గొప్ప వ్యక్తి ఆశాదిప్ అని తాండ్ర కోలాటం ఆడే మహిళలు పత్రికా మిత్రులతో మాట్లాడుతూ ఆశాదీప్ రెడ్డి వల్ల మాకు గుర్తింపు వచ్చిందని మా ఊరికి మంచిపేరుతెస్తున్నాడని కొందరు ఇది ఓర్వలేని వారు ఆయనపై ఆరోపణలు చేస్తున్నారని ఆశాదీప్ రెడ్డి మాకు ఎలాంటి అన్యాయం చేయలేదని ఆయన సొంత డబ్బులతో కోచ్ ను పెట్టి మాకు కోలాటం నేర్పించడం జరిగిందని దానివల్ల నాగర్ కర్నూల్ జిల్లా మొత్తంలో ఎక్కడ కోలాటాలు వాడిన మమ్మల్ని పిలుస్తున్నారని మాకు నాగర్ కర్నూల్ జిల్లా మొత్తంలో కోలాటం లో మంచి పేరు వచ్చిందని మాలోని నైపుణ్యాన్ని వెలికి తీసిన వ్యక్తి ఆశాదీప్ రెడ్డి అని మహిళలు కొనియాడారు.

## మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్ అక్టోబర్ 09 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్)** ప్రజా సమస్యల పరిష్కారానికి బుధవారం హైదరాబాద్ లోని గాంధీభవన్లో నిర్వహించిన మంత్రుల ముఖాముఖి కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు వివిధ సమస్యలపై వినతి పత్రాలు మంత్రికి అందజేశారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం చేసే అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తో చర్చించానని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసేలా చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ప్రతి బుధ, శుక్రవారం గాంధీభవన్లో మంత్రులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు కార్యకర్తలు, ప్రజల నుంచి విజ్ఞాపన పత్రాలు స్వీకరించారని వెలిచాల రాజేందర్ రావు తెలిపారు. రాబోయే రోజుల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సహకారంతో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

## మీడియా పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న యూసుబ్ అనే వ్యక్తి అరెస్ట్



**-అక్రిడేషన్ కార్డ్స్ ఇప్పించి ప్రభుత్వం ద్వారా వచ్చే డబుల్ బెడ్ రూమ్స్, ఫ్లాట్స్ ఇప్పిస్తా అంటూ మోసాలు...**

**-వివారలు వెల్లడించిన వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి.....**

**వేములవాడ అక్టోబర్ 09 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )** ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.వేములవాడ పట్టణం రుద్రవరం గ్రామం ఆర్ అండ్ ఆర్ కాలనీ చెందిన ఎండి యూసుబ్ , తండ్రి ఇస్మాయిల్ అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాల నుండి నేషనల్ ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో విలేఖరిగా పనిచేస్తున్నానని, మల్యాల గ్రామనికి చెందిన రొండి చంద్రయ్య అను వ్యక్తికి, అదే రంగంలో పనిచేస్తున్న చౌక్కాల వనజ, పీసరి శ్రీనివాసుల ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో విలేఖరిగా చేర్పించి,అక్రిడేషన్ కార్డులు ఇప్పించి తద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ పొందవచ్చని మరియు డబుల్ బెడ్ రూమ్ లు ఇప్పిస్తానని ఆశ చూపి, అతని నుండి డబ్బులు వసూలు చేసి మోసం చేసినారు. ఇదే విధంగా రామన్నపేట గ్రామానికి చెందిన ఆరుట్ల ఆది మల్లయ్య కు కూడా అసైన్డ్ భూమి ఇస్తానని డబ్బులు వసూలు చేసినారు.ఇట్టి ఫిర్యాదు పై చందుర్తి పోలీస్ స్టేషన్లో కేసు కాగా గతంలో చౌక్కాల వనజ మరియు కీసర శ్రీనివాస్ లను అరెస్టు చేసి రిమాండ్ తరలించనైనది. అప్పటి నుండి తప్పించుకుని తిరుగుతున్న ఎండి యూసుబ్ ను అదుపులోకి తీసుకొని జ్యూడిషియల్ రిమాండ్ కి తరలించడం జరిగిందని ఏఎస్పీ తెలిపారు.

## సరస్వతి మాత అలంకరణలో అమ్మవారి దర్శనం



**అక్టోబర్ 9 మన వార్త ప్రతినిధి** అమ్మ వారి దీవెనలు కల్వకుర్తి ప్రజలకు ఉండాలి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి దేవాలయం కల్వకుర్తిలో ఈరోజు ఏడవ రోజు అమ్మవారు సరస్వతీదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. ఈరోజు ప్రత్యేకత సామూహిక వడి బియ్యం కార్యక్రమం నిర్వహించడం జరిగింది మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి వడి బియ్యం పోయడం జరిగింది. అదే విధంగా చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం మహా మంగళహారతి తీర్థప్రసాద వితరణ మరియు విచ్చేసిన భక్తులకు భోజన ప్రసాదం ఏర్పాటుచేయడంజరిగింది. దేవాలయ ట్రస్ట్ చైర్మన్ శ్రీ జూలూరి రమేష్ బాబు గారి ఆధ్వర్యంలో నిర్వహించినఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు గంప శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నారాయణరాజు, దాచేపల్లి నితిన్ కుమార్, కోశాధికారులు పానుగంటి నవీన్, సంబు తరుణ్, వాస మనీష్, ఉత్సవ కమిటీ ముఖ్య సలహాదారులు దాచేపల్లి శ్రీనివాసులు, సంబు ముత్యాలు, వాస శేఖర్, గంధం కిరణ్ ప్రసాద్, గందె రవి, కల్వ రమేష్, గుబ్బ వెంకటేష్, కంది ప్రవీణ్, గార్లపాటి శ్రీనివాసులు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, శివ జగదీశ్వర్ మరియు ఆర్యవైశ్య సంఘం , వాసవి క్లబ్, అవోప మరియు అనుబంధ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

## వామపక్ష చైతన్యానికి ప్రతీక సింగభూపాలెం



**-గ్రామ సమస్యలపై విస్తృతంగా శాఖలు పనిచేయాలి**

**-కాసాని ఐలయ్య**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 9 మనవార్త ప్రతినిధి )** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సింగభూపాలెం గ్రామ శాఖా మహాసభలు బుధవారం సింగభూపాలెం గ్రామంలో సీతారాం ఏచూరి ప్రాంగణంలో నిర్వహించారు. వందలాది మందితో భారీ ప్రదర్శన నిర్వహించారు, అనంతరం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మహాసభల ప్రారంభం సూచికగా బుగ్గవీటి సరళ జెండా ఆవిష్కరణ చేసారు. పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రారంభసభలో కాట్రాల తిరుపతిరావు అమరులకు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య మాట్లాడుతూ ఈ మహాసభలలో గత మూడేళ్ల కాలంలో సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాలు,ప్రజా ఉద్యమాలు,సమస్యల పరిష్కారంలో సిపిఎం చేసిన కృని సమీక్షిస్తారన్నారు. భవిష్యత్తు పోరాటాలకు మహాసభ రూపకల్పన చేస్తుందన్నారు. ఆయన మాట్లాడుతూ సుజాతనగర్ మండలంలో అనేక సమస్యలకు సిపిఎం పార్టీ నాయకత్వం వహించి పరిష్కరించిందన్నారు. మండలంలో మొదటినుంచీ సింగభూపాలెం గ్రామం వామపక్ష పోరాటాల చైతన్యానికి ప్రతీకగా ఉందన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుగ్గవీటి సరళ, పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ మార్క్సిజం - లెనినిజం సిద్ధాంతం అజేయమనీ, శాఖా మహాసభలలో గ్రామాల్లోని అనేక సమస్యలు చర్చకు వచ్చాయనీ, ఆయా సమస్యల పరిష్కారానికై భవిష్యత్తులో పనిచేసేందుకు అనేక తీర్మానాలు చేసార,నీ వాటి పరిష్కారం కోసం భవిష్యత్తులో కృషిచేస్తారనీ అన్నారు. సింగభూపాలెం గ్రామంలో త్రాగునీరు, సాగునీరు, డ్రైనేజీలు, పండినపంటకు తగు మద్దతుధర, బోరింగుల ఏర్పాటు, లింక్ రోడ్లు, ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు, బైపాస్ రోడ్డు ప్రతిపాదన, రోజూ గ్రామపంచాయతీ పరిధిలో శానిటేషన్ పనులు, నీరుపలు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. గ్రామపంచాయతీ అభివృద్ధికి తగు నిధులు కేటాయించాలని కోరారు. నూతనంగా ఎన్నికైన 9 శాఖలకు నూతన బాధ్యులను ఎన్నుకొన్నట్లు తెలిపారు. లిక్కి నాగరాజు, వెంకటేష్ ,రమేష్, లక్ష్మీ, పలువురు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లిక్కి బాలరాజు, పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్, మండల నాయకులు చప్పిడి వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి వీరభద్రం, పిఎన్ఎం శ్రీధర్ పాల్గొన్నారు.

## గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు తీరు మార్చుకోవాలి

**గజ్వేల్ అక్టోబర్ 09(మన వార్త ప్రతినిధి జీ మురళి)** గజ్వేల్ నియోజక వర్గం కాంగ్రెస్ నాయకులు తీరు మార్చుకోవాలి అని బి ఆర్ ఎస్ యూత్ వింగ్ రాష్ట్ర నాయకుడు జుబెర్ పాషా అన్నారు బుదవారం సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో జుబెర్ పాషా మాట్లాడుతూ గజ్వేల్ కాంగ్రెస్ నాయకుల గ్రూపులు ఒకరిపై ఒకరు పై చేయి సాధించాలనే లక్ష్యంతో అధిష్ఠానం మెప్పు కోసం కెసిఆర్ కనబడడం లేదు అని పోలీస్ స్టేషన్ లో ఒక వర్గం పిర్యాదు చేయడం, మరో వర్గం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి చేయడం బాధాకరం అని, గజ్వేల్ లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు,కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేయడం లేదని గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ నాయకులు అసలు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ రూపకల్పన చేసింది కేసీఆర్ అని ఆ విషయాన్ని మరిచిపోయిన కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ మీద బురద జల్లడం మానుకోవాలని హితవు పలికారు,

## మైసమ్మకు గుడి నిర్మాణం స్వంత ఖర్చుల తో

### పూర్తి చేసిన మాజీ సర్పంచ్ జితేందర్ గౌడ్




**ఇల్లంతకుంట అక్టోబర్ 09 ( మన వార్త ప్రతినిధి బొంగోని రాజు)** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం లోని పెద్ద లింగాపూర్ గ్రామంలో గడి మైసమ్మకు గుడి నిర్మాణానికి గతంలో ఇచ్చిన మాట ప్రకారం మాజీ సర్పంచ్ జితేందర్ గౌడ్ గత వారం రోజుల క్రితం షెడ్డు నిర్మానికి భూమి పూజా చేసి 50,000/-రూ తన స్వంత ఖర్చుల తో పూర్తి చేసి ప్రారంభించారు .ఈ కార్యక్రమం లో నాయకులు గ్రామస్థులు పాల్గొన్నారు అనంతరం జితేందర్ గౌడ్ ని గ్రామస్థులు అభినందించారు.

## భూకబ్జా వ్యవహారంలో కేసు నమోదు..

**జమ్మికుంట, అక్టోబర్ 09( మన వార్త ప్రతినిధి):** నకిలీ ధృవ పాత్రలతో భూమి కబ్జా చేయడానికి ప్రయత్నం చేసిన వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు సీఐ రవి తెలిపారు. సిఐ వివరాల ప్రకారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం శివారులో గల సర్వే నెంబర్ 464 లో గల 4 గుంటల భూమి ని కొత్తపల్లి కి చెందిన కాటిపెల్లి రాజు నకిలీ ధృవ పత్రాలు సృష్టించి కబ్జా చేయడానికి ప్రయత్నం చేసినట్లు జమ్మికుంట తహశీల్దార్ గట్ల రమేష్ బాబు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఇంటింటా బీ జె పి సభ్యత్వ నమోదు..



**జమ్మికుంట, అక్టోబర్ 09( మన వార్త ప్రతినిధి):** కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపుమేరకు ప్రతి పోలింగ్ బూత్ లో 100 సభ్యత్వం చేయాలని సూచనతో బుధవారం జమ్మికుంట మండలంలోని బిగిరి షరీఫ్ గ్రామంలో 148, 149 పోలింగ్ బూతుల్లో బూత్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఇంటింటా సభ్యత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ సభ్యత నమోదు కార్యక్రమానికి బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేంద్ర పాల్గొని మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టే పథకాలు ప్రతి ఇంటికి చేరే విధంగా కార్యకర్తలకు చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ బూత్ అధ్యక్షులు రాచపల్లి సుధీర్, తిక్క శేఖర్, బీ జే వై ఎం నాయకులు కైలాసకోటి, గణేష్ లు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ ఆర్థిక సాయం



**అక్టోబర్ 9 (మన వార్తా ప్రతినిధి)** కడ్తాల్ మండలంలోని గానుగుమర్ల తండ గ్రామపంచాయతీ పరిధిలోని కానుగుబాయి తండకు చెందిన ఇస్లావత్ బిచ్చి అనారోగ్యంతో ఉదయం 6 గంటలకు మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ వెంటనే కానుగు బావి చేరుకొని బిచ్చి మృతదేహానికి పూలమాలవేసినివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5000 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం మండలంలోని రావిచెడు గ్రామానికి చెందిన కళావతి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి 5000 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు ఈ కార్యక్రమంలో. మాజీ ఎంపిటిసి గోపాల్ డైరెక్టర్ సేవ్య నాయక్ మాజీ సర్పంచ్ రాములు మాజీ ఉపసర్పంచ్ శారదా పాండు రైతు సమితి సభ్యులు నరసింహ డైరెక్టర్ లాయక్ అలీ మాజీ వార్డు సభ్యులు భీమన్ లక్ష్మణ్ నాయకులు లక్ పతి శ్రీను రాజు బిచ్చియ్య టిక్ లాల్ కిషన్ చందర్ కోటియ్య పాండు సేవ్య లక్ష్మణ్ రవి గోపి శంకర్ జె డిఎన్ వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ నర్సింగ్ జగన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ మ్యాచ్ లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం



**-విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తిని చూపండి సబ్బని వెంకట్ ...**

**హుజురాబాద్,అక్టోబర్ 9 ( మన వార్త ప్రతినిధి )** హుజురాబాద్ శాతవాహన విశ్వవిద్యాలయం దివంగత క్రికెట్ కోచ్ లవణ్ కుమార్ స్మారకార్థం హుజురాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో నిర్వహించిన క్రికెట్ ట్రోఫీ ముగిసింది. ఈ ట్రోఫీలో గెలుపొందిన విజేతలకు ప్రముఖ సామాజికవేత్త వెంకట్ మొదటి విజేతగా నిలిచిన జట్లకు నగదు రూపంలో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సబ్బని వెంకట్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువకులు, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకొని క్రీడల్లో చురుగ్గా రాణించాలని అన్నారు. యువకులు ఎంతో ఉత్సాహంతో హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామాల నుండి పాల్గొనడం మంచి పరిణామామని ఈ ట్రోఫీని ఆదర్శంగా తీసుకొని అన్ని మండలాల్లో మ్యాచులు నిర్వహిస్తే నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని సబ్బని వెంకట్ భరోసా కల్పించారు. రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే విధంగా పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. ఈ మ్యాచ్ కండక్ట్ చేసిన ఆర్గనైజర్స్ ను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్..



**జమ్మికుంట, అక్టోబర్ 09 ( మన వార్త ప్రతినిధి):** ప్రకృతిని పువ్వులను దేవతలుగా కొలుస్తూ తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మ పండుగ చివరి రోజు సద్దుల బతుకమ్మ చిన్నా పెద్దా యువతులు,మహిళలు ఆడుకుంటారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ పండుగ కోసం ఆడపడుచులు బతుకమ్మ సంబరాలు ప్రశాంతంగా జరుపుకోవడానికి మున్సిపల్ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాల భారీ లైట్లు ఏర్పాటు చేశారు.ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ సబ్బండ వర్గాలు ఏకత్వ స్ఫూర్తిని చాటుతూ తెలంగాణ మహిళల సంస్కృతికి అద్ధం పట్టే పూల పండుగ బతుకమ్మ పండుగ అని చెప్పారు. సద్దుల బతుకమ్మ పండుగను ఆడపడుచులు సంతోషంగా సంబరాలు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తో పాటు మేనేజర్ , సిబ్బంది పాల్గొన్నారు.

## టీమిండియా 86 పరుగుల తేడాతో విజయం

## చరిత్ర సృష్టించిన నితీష్ కుమార్ రెడ్డి




టీమిండియా యువ ఆల్‌రౌండర్, తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ టీ20ల్లో 70 ప్లస్ రన్స్‌తో పాటు 2 వికెట్లు తీసిన తొలి భారత ఆల్‌రౌండర్‌గా చరిత్రకెక్కాడు.బంగ్లాదేశ్‌తో బుధవారం జరిగిన రెండో టీ20లో నితీష్ కుమార్ రెడ్డి ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా 86 పరుగుల తేడాతో విజయం సాధించగా.. నితీష్‌కుమార్ రెడ్డి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. బ్యాటింగ్‌లో 74 పరుగులు చేసిన నితీష్ కుమార్ రెడ్డి.. బౌలింగ్‌లో రెండు వికెట్లు పడగొట్టాడు. దాంతో ఈ ఘనతను అందుకున్న తొలి భారత ఆల్‌రౌండర్‌గా నిలిచాడు. అరంగేట్రం చేసిన రెండో టీ20లోనే బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో సత్తా చాటిన నితీష్ కుమార్ రెడ్డికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 221 పరుగుల భారీ స్కోర్ చేసింది. నితీష్ కుమార్ రెడ్డి(34 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్సలతో 74), రింకూ సింగ్(29 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సలతో 53)విధ్వంసకర హాఫ్ సెంచరీలతో సత్తా చాటగా.. హార్దిక్ పాండ్యా(19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సలతో 32) కూడా దూకుడుగా ఆడాడు.బంగ్లాదేశ్ బౌలర్లలో టస్కిన్ అహ్మద్, తంజిమ్ హసన్ షకీబ్, ముస్తాఫిజుర్ రెహ్మాన్ రెండేసి వికెట్లు తీయగా.. రిషద్ హొస్సేన్ మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 135 పరుగులు చేసి ఓటమిపాలైంది. మహ్మదుల్లా(39 బంతుల్లో 3 సిక్సలతో 41) మినహా మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు.భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, నితీష్ కుమార్ రెడ్డి రెండేసి వికెట్లు తీయగా.. అర్ష్‌దీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ, మయాంక్ యాదవ్, రియాన్ పరాగ్ తలో వికెట్ తీసారు. ఈ విజయంతో టీమిండియా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది. చివరి టీ20 హైదరాబాద్ వేదికగా శనివారం దసరా పండుగ రోజున జరగనుంది.




## భారత్ దెబ్బకు శ్రీలంక ఔట్

### టీ20 ప్రపంచ కప్ లో సెమీస్ కు టీమిండియా



టీ20 ప్రపంచ కప్ లో భారత్ మరో అద్భుత విజయం అందుకుంది. శ్రీలంక డూ-ఆర్-డై మ్యాచ్‌లో ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో శ్రీలంక జట్టు హ్యాట్రిక్ ఓటముల పాలైంది.ఈ గెలుపుతో భారత జట్టు సెమీస్ కు చేరువైంది. మహిళల టీ20 ప్రపంచ కప్ 2024లో భారత్ మరో విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో భారత మహిళా క్రికెట్ జట్టు ఐసీసీ మెగా టోర్నీలో సెమీస్ రేసుకు చేరువైంది. ఇక శ్రీలంక డూ-ఆర్-డై మ్యాచ్‌లో ఘోర పరాజయాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ మ్యాచ్ లో భారత్ బ్యాటింగ్, బౌలింగ్ లో అదరగొట్టింది.టీమిండియా సూపర్ విక్టరీ .దుబాయ్ లోని దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో మహిళల టీ20 ప్రపంచ కప్ 2024 లో భాగంగా గ్రూప్ ఏ 12వ మ్యాచ్ లో భారత్-శ్రీలంక జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్ లో భారత మహిళలు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ కు మంచి ఆరంభం లభించింది. మొత్తంగా ఈ మ్యాచ్ లో మూడు వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేసింది.భారత బ్యాటర్లలో షఫాలీ వర్మ 43 పరుగులు, స్మృతి మంధాన 50 పరుగులు, హర్మన్‌ప్రీత్ కౌర్ 52 పరుగుల ఇన్నింగ్స్ లతో తమ బ్యాట్ పవర్ చూపించారు. దీంతో భారత్ మూడు వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేసింది. జెమిమా రోడ్రిగ్స్ 16 పరుగులు, రిచా ఘోష్ 6లి పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో చమరి ఆటపట్టు, అమ కాంచనలు చెరో ఒక వికెట్ తీసుకున్నారు.సెమీస్ కు చేరువైన భారత్.. శ్రీలంక ఔట్..ఈ మ్యాచ్ శ్రీలంకకు డూ ఆర్ డై మ్యాచ్ లాంటిది. కానీ, ఇక్కడ కూడా ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. శ్రీలంక జట్టు హ్యాట్రిక్ ఓటముల పాలైంది. దీని కారణంగా ఆ జట్టు సెమీ-ఫైనల్‌కు చేరుకోవడం దాదాపు అసాధ్యంగా మారింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా 82 పరుగుల తేడాతో విజయం సాధించింది. టీమ్ ఇండియా తరపున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధానలు అర్ధశతకాలు బాదారు. అలాగే, షెఫాలీ వర్మ కూడా తన మంచి ఇన్నింగ్స్‌తో శ్రీలంకను దెబ్బకొట్టారు.కాగా, ఈ ఐసీసీ మెగా ఈవెంట్‌లో టీమిండియా తొలి మ్యాచ్ లో శుభారంభం చేయలేదు. న్యూజిలాండ్‌పై ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది. కానీ పాకిస్థాన్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో భారత మహిళల జట్టు అద్భుతమైన పునరాగమనం చేసి పాకిస్థాన్‌ను ఓడించింది. ఇప్పుడు శ్రీలంకపై టీమ్‌ఇండియా విజయం నమోదు చేసి సెమీఫైనల్‌కు మార్గం సుగమం చేసుకుంది.